

గ్యాస్ ఏజెన్సీ యజమానులకు అవగాహన

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 20న ప్రపంచ మెట్రాలజీ డే పురస్కరించుకుని గురువారం రవి థియేటర్ సమీపంలో ఉన్న గరిషా ఏజెన్సీ కార్యాలయంలో యాజమాన్యంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కంట్రోలర్ కె.జె.రవీంద్రారెడ్డి మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ యాక్ట్ 2009, లీగల్ మెట్రాలజీ ప్యాకేజ్డ్ కమాడిటీ రూల్స్ 2011 గురించి అవగాహన కల్పించామన్నారు. డెలివరీ చేసేటప్పుడు తూకం సరిగా ఉందో లేదో చూసుకోవాలని పేర్కొన్నారు. అధిక ధరలకు విక్రయించరాదని తెలిపారు. వ్యాపార సంఘాలు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ మెటల్ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

దళారుల దోపిడీని అరికట్టాలి

- వ్యవసాయ రుణాల మంజూరులో బ్యాంకర్ల అలసత్వం
- జడ్పి సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత
- పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు గైర్హాజర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి – కడప ప్రతినిధి

జిల్లాలోని ఉద్యాన రైతులను నాలుగు అంచెల దళారీ వ్యవస్థ దోపిడీ చేస్తుండడంపై వేముల, వీరపునాయునిపల్లి, కమలాపురం జడ్పిటిసిలు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సభాభవనంలో చైర్మన్ గోవిందరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదటగా పహల్గాం అమర జవాన్ మురళీనాయక్, జడ్పి మాజీ చైర్మన్ సి.ఎం.బలరామిరెడ్డి మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతపురం, తిరుపతి ప్రాంతాల్లో చీనీ కాయలు టన్ను రూ.26 వేలు పలుకు తుండగా పులివెందుల్లో మాత్రం వ్యాపారుల సిండికేటై రూ.16 వేల నుంచి రూ.18 వేలకు పరిమితం చేస్తున్నారని పలువురు సభ్యులు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్పందిస్తూ స్థానిక రాజకీయ నాయకత్వమే దోపిడీకి పరోక్ష సహకారం అందిస్తోందని విమర్శించారు. వేముల, వీరపునాయునిపల్లి జడ్పిటిసిలు స్పందిస్తూ అటువంటి నాయకులపై కూటమి సర్కారు విచారణకు ఆదేశించి చర్యలు తీసుకోవాలని సూచించడంతో వ్యవహారం సద్దుమణిగింది. పులివెందుల, కడప మార్కెట్ యార్డుల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయని, మార్కెటింగ్ శాఖ అధికార యంత్రాంగం మానిటరింగ్ చేయడం లేదని విమర్శించారు. ఫలితంగా పులివెందుల మార్కెట్‌లో 10 మంది వ్యాపారులు సిండికేటై ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని తెలిపారు. కలెక్టర్ సర్‌ప్రైజ్ విజిట్ చేస్తే వాస్తవాలను బోధపడతాయని సూచించారు. చీనీ, అరటి, మామిడి ఇతర ఉద్యాన రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారని, ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించాలని వాపోయారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో నకిలీ విత్తనాలు, ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ డీలర్లతో సమావేశం నిర్వహించి నకిలీ వ్యవహారాల గుట్టురట్టు చేయాలని, అవసరమైతే పీడీయాక్టు కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ అలసత్వం వహిస్తే ఏడాదిపాటు పడిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారుతుందని హెచ్చరించారు. చక్రాయపేట మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని జడ్పిటిసి శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. గండిక్షేత్రంలో లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రుణాలను మంజూరు చేయడంలో బ్యాంకర్లు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు చెందిన భూముల ఒన్‌బి ఫారాన్ని ఒరిజినల్ ఇవ్వకపోవడంతో బ్యాంకర్లు రుణ మొత్తాన్ని తగ్గిస్తున్నారని విఎన్‌పల్లి జడ్పిటిసి తెలిపారు. సికెదిన్నె, బి.కోడూరు జడ్పిటిసిలు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకం అమలు వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. సగిలేరు గురకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కాశినాయన జడ్పిటిసి ముత్యాల చెన్నయ్య మాట్లాడుతూ కరువు పరిస్థితుల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఏమేరకు ఆదుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి స్పందిస్తూ రూ.16 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు ప్రతిపాదనలు పంపించామని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా సుమారు 1,700 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, అత్యధికంగా అరటి రైతులకు నష్టం వాటిల్లిందని హార్టీకల్చర్ డిడి సుభాషిణీ వివరించారు. రూ.4 కోట్ల ప్రతిపాదనలు చేశామని తెలిపారు. రైతుబజారులో కార్యకలాపాలను వేగవంతం చేయాలని వేంపల్లి జడ్పిటిసి సూచించారు. కలెక్టర్ శ్రీధర్ స్పందిస్తూ వేంపల్లిలో పాలనాపరమైన తప్పిదాలపై విచారణ చేపట్టామని, చక్రాయపేటలో తాగునీటి ఎద్దడి, పులివెందుల మండలాల్లో మార్కెటింగ్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మైలవరం మండల పరిధిలోని ఎస్ఎఇఎల్ అనే సోలార్ కంపెనీ రైతుల భూములను దౌర్జన్యంగా ఆక్రమిస్తూ రైతులపైనే కేసులు నమోదు చేస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కల్వట్రాల గ్రామ పరిధిలో ఒక కొండ పరిధిలోని 200 ఎకరాలను ఆక్రమించుకుందన్నారు. పంచాయతీల పరిధిలోని గ్రేజీ భూ ములను సైతం కబ్జా చేస్తోందని తెలిపారు. చీనీ రైతులు తోటలను జెసిబిలతో దున్నేస్తోందని, ప్రశ్నించిన, అడ్డుకున్న రైతులపైనే వ్యవసాయశాఖ, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు కుమ్మక్కై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తోందని వాపోయారు. వ్యవసాయం లేకుండా పరిశ్రమలు మనలేవని సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే సంగతిని గ్రహించాలని, కలెక్టర్ జోక్యం చేసుకుని సోలార్ కంపెనీ ఇష్టా రాజ్యానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా స్పందిస్తూ వరికుంట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు విద్యుత్ కనెక్షన్‌తోపాటు లైవ్‌లోకి తీసుకురావాలని చెప్పారు. బి.మఠం జడ్పిటిసి స్పందిస్తూ టిజిపి లీకేజీలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మైలవరం కెనాల్ ఆక్రమణలపై నీటిపారుదలశాఖ సక్రమంగా వ్యవహరించడం లేదని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యాక్రమబద్ధీకరణపై ఒకటి, రెండు మినహా మిగిలిన తరగతుల నిర్వహణ విషయంలో విమర్శలు వస్తున్నాయని చెబుతుండగా కలెక్టర్ జోక్యం చేసుకుని తొమ్మిది రకాల పాఠశాలలుగా క్రమబద్ధీకరణ చేశారని, ఒకటి, రెండు తరగతులను మినహాయిస్తే మిగిలిన తరగతులకు సబ్జెక్టు నిపుణుల నియామకంతో నాణ్యమైన విద్యను అందించే ప్రయత్నం జరుగుతోందని, రాజకీయ నాయకత్వం సైతం తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 11 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీల్లో ఇద్దరు ఎమ్మెల్యేలు మినహా మిగిలిన వారు గైర్హాజరు కావడం గమనార్హం. సమావేశంలో జడ్పిటిసిలు, ఎంపిపిలు, ఉమ్మడి జిల్లాకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ పేరిట 'కత్తి'రింపు!

రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యాయ పోస్టుల కుదింపునకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం అమలులో భాగంగా ప్రాథమిక విద్యను తొమ్మిది రకాల పాఠశాలలను నిర్వహిస్తామనే పేరిట జారీ చేసిన జిఒ నెంబర్ 20 పేర్కొంది. ప్రభుత్వం వర్గీకరించిన తొమ్మిది రకాల కేటగిరీల్లో భాగమైన మోడల్ ప్రైమరీ పాఠశాలలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఉపాధ్యాయులను సర్‌ప్లస్‌గా చూపించే ప్రయత్నం చేసింది. సర్‌ప్లస్ ఎస్‌జిటిలకు హెచ్‌ఎంలుగా ప్రమోషన్ల కల్పిస్తున్న పేరిట గ్రామీణ పాఠశాలలకు తరలించే డిమోషన్‌కు శ్రీకారం చుట్టడంపై జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.

- మోడల్ ప్రైమరీ పాఠశాలలపై పెనుప్రభావం
- 9 రకాల పాఠశాలల ఏర్పాటు చేస్తూ జిఒ
- ప్రమోషన్ల పేరుతో ఎస్‌జిటిలకు డిమోషన్?!
- ఇంగ్లీష్ మీడియంలోనే విద్యా బోధన





ప్రజాశక్తి – కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక విద్య ప్రభావశీల మార్పులకు గురవుతోంది. కడప జిల్లాలో 2,816, అన్నమయ్య జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గాల పరిధిలో 1110 పాఠశాలలున్నాయి. ప్రైమరీ 1,872, మున్సిపల్ 82, ఎయిడెడ్ 66, ప్రయివేటు 723, మదరసాలు ఏడు పాఠశాలల చొప్పున ఉన్నాయి. కడప జిల్లాలో 3,05,663, అన్నమయ్య జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలలో 62,261 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జిఒ నెంబర్ 20 ద్వారా ప్రాథమిక విద్యను తొమ్మిది రకాల పాఠశాలలుగా వర్గీకరించింది. శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్, ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్‌ప్రైమరీ స్కూల్, మోడల్ ప్రైమరీ స్కూల్స్, అప్పర్ ప్రైమరీ స్కూల్స్, హైస్కూల్స్ (6 నుంచి 10). హైస్కూల్స్ క్లాసెస్ (ఒకటి నుంచి 10). హైస్కూల్ ప్లస్ (6 నుంచి 12) పాఠశాలలు, హైస్కూల్ ప్లస్ (ఒకటి నుంచి 12 వరకు) పాఠశాలలు ఉన్నాయి. మోడల్ ప్రైమరీ పాఠశాలలు ప్రభావితం అవుతున్నాయనే వాదన వినిపిస్తోంది. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు బోధించాల్సి ఉంది.ఎక్కువ సంఖ్యలో ఒకటి, రెండు తరగతులను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా మిగిలిన మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులు కిలోమీటరు దూరంలోని పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. సదరు గ్రామీణ విద్యార్థులు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు తరలిపోయేలా చేస్తోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. పంచాయతీకి ఒకటి చొప్పున పాఠశాల నిర్వహించాలనే డిమాండ్‌ను గాలికి వదిలేయడం ఆందోళన కలిగిస్తోంది. వైసిపి సర్కారు హయాంలో పాఠశాలల కుదింపుపై పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలు నెలకొన్న సంగతి తెలిసిందే. తాజాగా కూటమి సర్కారు సైతం వైసిపి ఆరు పాఠశాలల తరహాలోనే రెండు మీడియం తరహాలో తెలుగు మీడియాన్ని సైతం తొలగించడం గమనార్హం. ఇంగ్లీష్ మీడియంలో బోధించడం, తరగతి గదుల్లో విద్యార్థులను 45 నుంచి 54 మందికి పెంచడం, మిగిలిన వారిని సర్‌ప్లస్ ఉపాధ్యాయులుగా చూపించడం, సదరు ఎస్‌జిటిలను హెచ్‌ఎంలుగా ప్రమోషన్ల పేరుతో గ్రామీణ ప్రాంతాల కు తరలించి డిమోషన్ అనుభవాల్ని కలిగిస్తోందనే వాదన వినిపిస్తోంది.

ఉపాధ్యాయ పోస్టులను కుదించే యత్నమిది

ప్రభుత్వ తొమ్మిది రకాల పాఠశాలల కాన్సెప్ట్ ఉపాధ్యాయుల కుదింపులో భాగమేనని సందేహాల్ని కలిగిస్తోంది. తరగతి గదుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం ద్వారా మిగిలిన ఉపాధ్యాయులను సర్‌ప్లస్‌గా చూపించడం దారుణం. సర్‌ప్లస్ ఉపాధ్యా యులను ప్రమోషన్ల పేరిట గ్రామీణ ప్రాంతాలకు తరలించే డిమోషన్ చేయడం ఆందోళనకరం.

- పి.మహేష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కడప.

ప్రయివేటు పాఠశాలలను ప్రోత్సహించడమే

మోడల్‌ప్రైమరీ పాఠశాలలో ఎక్కువగా ఒకటి, రెండు తరగతులు నిర్వహించడం ద్వారా మూడు, నాలుగు, ఐదు తరగతుల పిల్లలను కిలోమీటర్ దూరంలోని పాఠ శాలలకు వెళ్లేలా చేయడం ప్రయివేటును ప్రోత్సహించడం అవుతుందనడంలో సందేహం లేదు.

- రవి, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి, కడప.

ఉర్దూ పోస్టులు కొనసాగించాలి

ఉర్దూ పాఠశాలల్లో పార్లల్ ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను కొనసాగించాలి. ఉర్దూ పాఠశాలలు నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయడం దారుణం.

- సయ్యద్ ఇక్బాల్, ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు.

తెలుగు మీడియాన్ని రద్దు చేయడం దారుణం

తెలుగు మీడియాన్ని పూర్తిగా రద్దు చేయడం దారుణం. సెక్షన్‌కు 45 మంది విద్యార్థులు ఉండగా, పునర్వవస్థీకరణలో 53 మంది విద్యార్థులను కేటాయించడంతో ఉపాధ్యాయ పోస్టులు మిగిలి పోతున్నాయి. విద్యార్థుల నిష్పత్తిని 1.45గా ఉండాలి.

- షేక్, జాబిర్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అన్నమయ్య.

పేద విద్యార్థులకు అందని విద్య

వైసిపి సర్కారు 117 జిఒ ప్రకారం ఆరు రకాల పాఠశాలలతో మార్పులు చేసింది. కూటమి సర్కారు 19, 20, 21 జిఒలను తీసుకుని తొమ్మిది రకాల పాఠశాలలతో ప్రభుత్వ విద్యారంగాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయగలరో చెప్పాలి. ఉపాధ్యాయ, విద్యార్థి, మేధోసంపత్తులతో చర్చలు చేసి పునర్వవస్థీకరణ చేసి ఉంటే బాగుండేది.

- నరసింహా, ఎస్ఎఫ్ఐ, జిల్లా ప్రధాన కార్యదర్శి, అన్నమయ్య.

వైసిపి సభ్యత్వానికి మున్సిపల్ చైర్మన్

మాచనూరు చంద్ర రాజీనామా

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)



గత కొంతకాలంగా వైసిపికి దూరంగా ఉంటున్న మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర గురువారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మైదుకూరులో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక పార్టీ పరిస్థితులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి వల్ల పార్టీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. మాజీ సిఎంతో కలిపి మాట్లాడించాలని మూడు నెలలుగా కోరుతున్నా మాజీ ఎమ్మెల్యే పట్టించుకోలేదని ఆరోపించారు. అనుచరులు, బంధువుల అభిప్రాయం మేరకు భవిష్యత్తు నిర్ణయంతీసుకుంటామని ప్రకటించారు. ఇదిలా ఉండగా గురువారం మాజీ ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపికి చెందిన కౌన్సిలర్లు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్ మార్పుపై మైదుకూరులో రాజకీయంగా చర్చ ప్రారంభమైంది.

వరకట్న వేధింపులు తాళలేక

నవవధువు ఆత్మహత్య

ప్రజాశక్తి- పులివెందుల రూరల్



మృతి చెందిన అర్షియా

వరకట్న వేధింపులు తాళలేక ఓ నవవధువు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన పట్టణంలోని నగరి గుట్ట సమీపంలో చోటు చేసుకుది. పోలీసుల వివరాల ప్రకారం.. కరీముల్లా జైబునిస దంపతుల కుమార్తె అర్షియా (21)ను నగరిగుట్టుకు చెందిన ఫక్రుద్దీన్ అనే వ్యక్తితో ఈ ఏడాది జనవరిలో వివాహం చేశారు. అప్పటినుంచి అర్షియాను వరకట్నం కోసం భర్త ఫక్రు ద్దీన్ వేదిస్తూ ఉండేవాడు. ఈ నేప థ్యంలో గురువారం తెల్లవారు జామున ఇంటిలో ఎవరు లేని సమయంలో ఆమె ఫ్యాన్ కొరేసుకొని ఆత్మహత్య చేసు కున్నారు. విషయం తెలుసుకున్న సిఐ చాంద్‌బాషా సంఘటన స్థలానికి చేరు కుని ఆత్మ హత్య గల కారణాలను కుటుంబసభ్యులను, స్థానికులను అడిగి తెలు సుకున్నారు. భర్త వరకట్న వేధింపులు డబ్బులు సమస్యలతోనే ఆత్మహత్య చేసు కున్నట్లు సిఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడ తహశీల్దార్, సిఐ ఆధ్వ ర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. బాధితురాలు తల్లిదండ్రులు ఫిర్యాదు మేం ేకు భర్త, అత్తామామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైవీయూ ఎంఎస్‌సి, ఎంకామ్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంఎస్‌సి, ఎంకామ్ 49వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగామినేషన్ ప్రొఫెసర్ కె.ఎస్.వి కృష్ణారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆచార్య పద్మ మాట్లాడుతూ ఏప్రిల్‌లో నిర్వహించిన పరీక్షలకు సంబంధించి ఫలితాలు విడుదల చేశామన్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగామినేషన్ ప్రొఫెసర్ మాట్లాడుతూ వైవీయూ వి సి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మార్గదర్శకంలో పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం పూర్తి చేశామని తెలిపారు. ఎంఎ తెలుగు, హిస్టరీ, పిఎస్ అండ్ పిఎ, ఎకనామిక్స్, ఉర్దూ ఎంకాం కోర్సులలో విద్యార్థులు వంద శాతం ఫలితాలను సొంతం చేసుకున్నారని చెప్పారు. అఫిలియేటెడ్ కళాశాలలో ఎంకామ్‌లో 96.30 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు డాక్టర్ కె. శ్రీనివాసరావు, కామర్స్ సహ ఆచార్యులు డాక్టర్ జి.హరినాథ్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

దేశవ్యాప్త కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను కార్మికులు, ఉద్యోగులు, శ్రమజీవులు, గ్రామీణ ప్రజానికం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎటియుసి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్. నాగసుబ్బారెడ్డి, బి.మనోహర్, వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు జాషువా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, అన్వేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఎఐటియుసి కార్యాలయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎఐటియుసి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్, కె.శ్రీనివాసులురెడ్డి సంయుక్త అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కార్మికులకు , గ్రామీణ పేదలకు భూమిని అందించాలని పేర్కొన్నారు. బలవంతపు భూ సేకరణను నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వ భూములు ఆక్రమించన వారి నుంచి విడిపించి గ్రామీణ వ్యవసాయ కూలీలకు భూములు పంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను బలహీన పర్చడం, అమ్మడం మానుకోవాలని తెలిపారు. నూటికి 90 శాతంగా స్వయం ఉపాధి పొందుతున్న ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్‌పై పెద్ద ఎత్తున ఆర్థిక దాడికి పాల్పడుతుందని, అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు, ట్యాక్స్ టోల్ ఛార్జీలు పెంచి నడ్డి విరుస్తుందని విమర్శించారు. మరోవైపు అగ్రిగ్రేటర్స్ పేరుతో స్వదేశీ, విదేశీ బహుళజాతి కంపెనీలకు అనుమతిస్తుందని చెప్పారు. వాహన ఫిట్నెస్, రెన్యువల్, రిజిస్ట్రేషన్, లైసెన్స్ సేవలను సైతం ప్రైవేటు సంస్థలకు ఇచ్చిందన్నారు. ఈ చర్యలతో రవాణా రంగం తీవ్రంగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ ను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఆశా, మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ తదితర స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని పేర్కొన్నారు. బ్రిటిష్ కాలం నాటి కార్మికులు పోరాడి సాధించిన కార్మిక హక్కులను చట్టాలను హరించి తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని తెలిపారు. సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సి.బాదుల్లా, ఎఐటియుసి నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మరియమ్మ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అమ్ములు, నగర అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మినరసమ్మ, శాంతమ్మ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తారక రామారావు, సుంకర రవి, మెలంగి రాజశేఖర్ పాల్గొన్నారు.

బద్వేలు : కార్మికుల హక్కులను హరించే 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని, సమాన పనికి– సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థలు పరిరక్షణ కోసం, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని మరియు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఎఐటియుసి– సిఐటియు ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఏఐటియుసి కార్యాలయం నందు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి ఏరియా కార్యదర్శి పి.వి రమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు సంయుక్తంగా మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం మీద బహుముఖ దాడి చేపట్టిందన్నారు. 95 శాతంగా ఉన్న కార్మికులకు తీవ్రమైన నష్టం చేకూర్చే విధంగా కార్మిక చట్టాలు, హక్కులపై దాడి చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు ప్రశ్నించే హక్కు లేకుండా, పని గంటలతో సంబంధం లేకుండా కార్మికులను కట్టు బానిసలుగా చేసే పరిస్థితి నేడు మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇరుపోతూ ఓబులేసు, పట్టణ నాయకులు నాగరపు సత్యరాజు,అమిలిపోగు బాబు,దియ్యాల వెంకటేశ్వర్లు, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి ఈర్ల నగేష్, పట్టణ నాయకులు రషీద్, తంబీ, వెంకటేష్, పడిగే వెంకటరమణ, చిన్నా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రవీద్రనాథ్

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి -'కడప

ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల డాక్టర్ జి. రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. గురువారం ప్రభుత్వ పురుషుల కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, వేసవి తాపాన్ని తట్టుకునేందుకు 'బీట్ ది హీట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సామాజిక బాధ్యత పెరుగుతుందని అన్నారు. అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సు కోసం కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ అంకాల నాగరాజు, శివరామకృష్ణ ఆధ్వర్యంలో 'బీట్ ది హీట్' కార్యక్రమంలో భాగంగా మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివరాం, హజరతయ్య, శ్రీనివాసులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది : వైసిపి

ప్రజాశక్తి - కడప : రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని కక్ష సాధింపులో మాత్రం ముందుండి రాక్షసానందం పొందుతున్నారని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. కడప మేయర్ సురేష్ బాబు విషయంలోనూ అదే తీరులో వెళ్తున్నారని అన్నారు. గురువారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడారు.అసలు యాక్ట్ లేదని, మనం జిహెచ్‌ఎంసి యాక్టు అమలు చేసుకుంటున్నామని చెప్పార. మన రాష్ట్రానికి అసలు యాక్ట్ లేనే లేదు అన్నారు. జిహెచ్‌ఎంసి చూపించి యాక్టు చూపించి మేయర్ పై చర్యలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మేయర్ కుమారుడి సంస్థకు కమిషనర్ రిజిస్టర్ చేస్తే అప్పుడు ఎందుకు రిజెక్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఆరోపణల్లో ఏదైనా అవినీతి చూపించలేదు, కుర్చీల కోసం కుమ్ములాట కోసం ఇదంతా జరుగుతోంది మాత్రమే తప్ప వేరొకటి లేదని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై తమకు గౌరవం ఉందని, మేయర్ విషయంలో న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. చిన్న విషయాన్ని చూపి అనర్హత అనడం దారుణం అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - కడప : కడప జిజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స చేశారు. 46 ఏళ్ల దర్బార్బీ అనే మహిళ కడుపు నొప్పి, ఉబ్బరం రావడతో శనివారం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (రిమ్స్)లో చేరారు. వైద్యులు అన్నీ పరీక్షలు చేసి సర్వైకల్ ఫైబ్రాయిడ్‌గా నిర్ధారణ చేశారు. మంగళవారం డాక్టర్ అమానుల్లా నేతృత్వంలో వైద్య బృందం మూడు గంటల పాటు శ్రమించి 8 కిలోల బరువున్న గర్భాశయ ముఖ ద్వారం కణితిని తొలగించారు. ఈ సందర్భంగా గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మి సుశీల మాట్లాడుతూ ఆపరేషన్ అయిన తర్వాత రోగి బాగా కోలుకున్నారని, ఇప్పుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు తెలిపారు. రెండు మూడు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామన్నారు.

రాయలసీమ పరిశోధనా తపస్వి 'కట్టా'

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : రాయలసీమ పరిశోధన తప్పస్వీ విద్వాన్ కట్టా నరసింహులని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య కొనియాడారు. మైదుకూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో విద్వాన్ ,ప్రముఖ పరిశోధకుడు కట్టా నరసింహులు 4వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తవ్వా మాట్లాడుతూ రాయలసీమ సాహిత్య పరిశోధనకు విద్వాన్ కట్టా నరసింహులు ఎనలేని కృషి చేశారని ప్రశంసించారు. సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులుగా వ్యవహరించి కడప కైఫయత్తులను వెలుగులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం ప్రాచీనతను వెలుగులోకి తెచ్చి ప్రభుత్వ లాంఛనాలతో శ్రీరాముని కల్యాణం జరగడానికి ప్రధాన కారకులు కట్టా నరసింహులని చెప్పారు. సభాధ్యక్షులు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ 2005లో కట్టా ప్రభుత్వ పరంగా విశ్రాంతి పొందిన తర్వాత సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా నియమితులై జానుమద్ది హనుమచ్ఛస్త్రితో కలిసి జిల్లా సంస్కృతి పుస్తకాన్ని రచించారని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంతి ఉపాధ్యాయులు పొలిమేర ఓబన్న , విద్యార్థులు పాల్గొన్నారు

కుర్చీకి ఎలాంటి సంబంధం లేదు

ప్రజాశక్తి - కడప అర్బన్ : మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని, మేయర్ పదవి పోవడానికి, ఎమ్మెల్యే కుర్చీకి సంబంధం లేదని కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, సూర్యనారాయణ అన్నారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పు చేస్తే ఎంతటి వారైనా తప్పించుకోలేరు అని కూటమి ప్రభుత్వం నిరూపించిందని పేర్కొన్నారు. మేయర్ కుమారుడికి, సతీమణికి పనులు కట్టబెట్టడమే పదవి పోవడానికి కారణమని చెప్పారు. మున్సిపల్ యాక్ట్ 1955 ప్రకారం చర్యలు తీసుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే చెత్త పన్ను రద్దు చేసిందని, చెప్పారు. వైసిపి కంచుకోటలో మహిళా ఎమ్మెల్యే బద్దలు కొట్టడంతో దిక్కు తోచని స్థితిలో వైసిపి నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. మంచినీటి సమస్య, బుగ్గ వంక సుందరీ కరణ, భూగర్భ డ్రైనేజీ సమస్యలను వైసిపి పరిష్కరించలేకపోయిందని పేర్కొన్నారు. రవీంద్ర నగర్ బుగ్గ వంక పై బ్రిడ్జిలు నిర్మించలేక చేతులెత్తేసారని తెలిపారు. మహిళా ఎమ్మెల్యే వాటిని పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పారు. మేయర్ పదవిపై టిడిపికి ఆశ లేదని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి ఆదేశాల మేరకు ముందుకెళ్తామన్నారు.



మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

మెడికల్ కళాశాలను వెంటనే ప్రారంభించాలి : పిసిసి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలను వెంటనే ప్రారంభించాలని, కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయడానికి ప్రయత్నిస్తుందని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 670 కోట్లు ఖర్చు చేసి పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల ను సర్వాంగ సుందరంగా నిర్మించడం జరిగింది. 2024-25 విద్యా సంవత్సరానికి నేషనల్ మెడికల్ కమిషన్ 2024 ఆగస్టు 16న 50 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు చేసిందని చెప్పారు. మౌలిక సదుపాయాలు లేవని, సిబ్బంది కొరత ఉందని సాకులు చూపి మంజూరు చేసిన సీట్లను వద్దని చంద్ర బాబు ప్రభుత్వం అదే ఏడాది సెప్టెంబర్ 10న మెడికల్ కమిషన్‌కు లేఖ రాసిందని పేర్కొన్నారు. ఇది దురదృష్టకరం అన్నారు. అన్ని రాష్ట్రాలు అదనపు ఎంబిబిఎస్ సీట్లు తెచ్చుకుంటూ ఉంటే చంద్ర బాబు ప్రభుత్వం మంజూరైన సీట్లు వద్దు అనడం విడ్డూరంగా ఉంది అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అసమర్థత కారణంగా ఆంధ్ర ప్రదేశ్ 2024-25లో 700 ఎంబిబిఎస్ సీట్లను, 2025-26 లో మరో 700 ఎంబిబిఎస్ సీట్లను కోల్పోయామని పేర్కొన్నారు. పులివెందుల, ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పార్వతీపురం, అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పెనుకొండ, పాలకొల్లు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేయాలని, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చంద్ర బాబు ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయమని వాపోయారు. దీని వల్ల ప్రతిభా వంతులైన పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతుందని చెప్పారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన తప్పిదాల వల్లే కళాశాల చాలా ప్రారంభం కాకపోవడానికి కారణమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, ఆనందరెడ్డి, శంకర్ రెడ్డి, వినోద్ కుమార్ రెడ్డి, దీక్షిత్, ఓబులేసు యాదవ్, నూర్ బాషా, నాగరాజు, వెంగళ రెడ్డి, సుబ్రమణ్యం, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

జలహితుడు కాటన్ దొర

వేంపల్లె : సర్ ఆర్థర్ కాటన్ దొర జల హితుడని, జన హితుడని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి కొనియాడారు. గురువారం వేంపల్లెలో కాటన్ దొర 222 వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ కాటన్ దొర ఆంగ్లేయుడైనప్పటికీ సమాజ సేవ పరమావధిగా భావించి భారతీయులు ప్రత్యేకించి ఆంధ్రుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. 1847-1852 మధ్య కాలంలో గోదావరి నది మీద ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి క్షామ పీడిత ప్రాంతమైన గోదావరి జిల్లాలను సస్య శ్యామలం చేసిన దుఃఖ దాయిని అయిన గోదావరి నదిని సుఖ దాయినిగా చేశారని తెలిపారు. కృష్ణా నదిపై విజయవాడ వద్ద ఆనకట్ట నిర్మాణం, కావేరి నదిపై ఆనకట్ట నిర్మాణం కాటన్ దొర కృషి వల్లనే అన్నారు.

మూడు నెలలుగా వేతనాలు బంద్

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీలోని శ్రీ వెంకటేశ్వర పశు సంవర్థక కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ, మెస్ వర్కర్లకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని, దీంతో కుటుంబ పోషణ భారంగా ఉందని కాంట్రాక్ట్ ఉద్యోగి రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో పని చేస్తున్న ఉద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. అప్పులు ఇచ్చే కిరాణా షాప్ వాళ్లు నెలలుగా బాకీ తీర్చకపోవడంతో సరుకులు ఇవ్వడం లేదని వాపోయారు. రోజువారి ఖర్చులకు కూడా కష్టంగా ఉందని అన్నారు. సమస్యను సంబంధిత అధికారికి తెలుపగా సిఎఫ్ఎంఎస్ లో జాప్యం జరుగుతుందని తెలిపారన్నారు. ఇప్పటికైనా విశ్వవిద్యాలయం అధికారులు చొరవ తీసుకొని బకాయి ఉన్న వేతనాలను మంజూరు చేయాలని కోరారు.

పెద్దమ్మ గుడి వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో ఉన్న పెద్దమ్మ గుడి వద్ద కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు వచ్చిన వారిని గ్రామస్తులు అడ్డుకోవడంతో గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దమ్మ గుడికి 657 సర్వేనెంబర్‌లో మూడు ఎకరాల 9 సెంట్ల భూమి ఉంది. ఇందులో 50 సెంట్లు ఆక్రమణకు గురైంది. అదే గ్రామానికి చెందిన ఎంపీ రమేష్ నాయుడు గుడి ప్రాంగణానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎంపీ ఫండ్స్ నుంచి రూ. కోటి కేటాయించారు. గుడికి మూడెకరాల తొమ్మిది సెంట్లు జాగా ఉండగా కేవలం ఒక ఎకరం జాగాలో కాంపౌండ్ వాల్ కోసం బేస్ మటమ్ వేసేందుకు గతంలో పనులు మొదలుపెట్టారు. అప్పుడు స్థానికులు గుడికి ఉన్న మొత్తం జాగాలో కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని పనులను అడ్డుకున్నారు. ఆ విషయంలో గ్రామస్తులు పనులను నిలుపుదల చేసేందుకు కోర్టు నుంచి స్టే తీసుకొచ్చారు. రెండు నెలల నుంచి పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం మరల గురువారం పనులు ప్రారంభించేందుకు యత్నించడంతో గ్రామస్తులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు ఘర్షణలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఈ విషయమై గ్రామస్తులు అందరూ ఎండోమెంట్ ఇఒకు రాతపూర్వక ఫిర్యాదును చేశారు. గత సంవత్సరం దేవర నిర్వహిచినప్పుడు 40 వేల మంది పైన జనం హాజరయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న స్థలం చాలక దేవరలో తొక్కిసలాట జరిగి పలువురు గాయపడ్డారని వారు తెలిపారు. గుడి ప్రాంగణం మూడు ఎకరాల తొమ్మిది సెంట్లు కొలతలు వేసి ప్రహరీ నిర్మించాలని ఎండోమెంట్ ఇఒను వారు ఫిర్యాదులో కోరారు.

ఉపాధి కూలీలకు అవగాహన

ప్రజాశక్తి-చెన్నూరు

మండలం లోని కొక్కరాయపల్లి గ్రామ పంచాయతీలో డిప్యూటీ ఎంపిడిఒ. సురేష్ బాబు గురువారం ఉపాధి పనులు తనిఖీ చేసి కూలీలకు వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త గురించి వివరించారు. వారికి ఒఆర్ ఎస్ ప్యాకెట్లను అందజేశారు. అనంతరం కొక్కరాయపల్లిలో పర్యటించి పారిశుధ్యం గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ , పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు హార్టికల్చర్ పంటలపై గ్రామసభలు

ప్రజాశక్తి - లింగాల

మండల పరిధిలోని 19 పంచాయతీల్లో శుక్రవారం హార్టికల్చర్ పంటలపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఉపాధి హామీ చట్టం ద్వారా మొక్కలకు నగదు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. చీనీ, జామ, సన్ననిమ్మ, మామిడి, సపోటా, కొబ్బరి, దానిమ్మ, డ్రాగన్, మల్లెలు, రోజా వంటి మొక్కలు సాగు చేస్తే నగదు చెల్లిస్తామన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిందితులను త్వరలో పట్టుకుంటాం

ప్రజాశక్తి-చక్రాయపేట

చంటి హత్య కేసులో నిందితులను త్వరలో పట్టుకుటామని డిఎస్పి మురళీనాయక్ పేరొన్నా్నరు. ఇటీవల మండలంలోని సురభి గ్రామం కోమటి పేటలోని కందుల చంటి అనే వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. గురువారం డిఎస్పి ఆర్‌కె వ్యాలీ సిఐ వలసయ్య, సిఐ చంద్రశేఖర్‌తో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ రెండు రోజుల కిందట దర్శనమ్మ, రమణ కుమార్, ఈశ్వరయ్య చంటి అనే వ్యక్తిని రాళ్ల దాడి చేసి హత్య చేశారని పేర్కొన్నారు. గతంలో దర్శనమ్మ గతంలో మరొకరిని ఇదే రీతిలో హత్య చేశారని పేర్కొన్నారు. ఆమె చేసిన మూడో హత్య ఇదని ఆయన చెప్పారు. నిందితులను పట్టుకుని వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆగిన రోడ్డు పనులు

- రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు
- అవస్థల్లో ప్రజలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని అలిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని తూపల్లెలో రోడ్డు పనులు నిలిచి పోయాయి. దీంతో కురిసిన కొద్దిపాటి వర్షానికే రోడ్డు జలమయమవుతుంది. రోడ్డుపై వర్షపు నీరు నిలిచి పోవడంతో అ రహదారిలో వెళ్లే రైతులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొనేళ్ళుగా తూపల్లె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండడంతో సిమెంట్ వేయాలని టిడిపి నాయకులు ఎమ్మెల్సీని కోరారు. రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. సిమెంట్ రోడ్డు పనులు చేసేందుకు కంకరను కూడ తొలి పనులు చేసేందుకు సిద్ధం చేశారు. అయితే టిడిపికి చెందిన మరో గ్రూపునకు చెందిన నాయకులు రోడ్డు పనులు జరగకుండా అడుకున్నారు. ఫలితంగా రోడ్డుపైన పాఠశాల వద్ద వర్షపు నీరు నిలిచాయి. పాఠశాల తెరిచిన తర్వాత విద్యార్థులు మురుగు నీటిలోనే పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. పాఠశాల వద్ద వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండేందుకు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తొలిగేందుకు సిమెంట్ రోడ్డు వేస్తే బాగుంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనప్పటికీ గ్రూపు తగదాతో అరకొరగా జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులు ఆగిపోయింది. ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సిబిఎస్ఇ ఫలితాల్లో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల విడుదలైన సిబిఎస్ఇ పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో బీరం విద్యా సంస్థల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి తమ సత్తాను చాటుకున్నారని విద్యా సంస్థల కరస్పాండెంట్, చైర్‌పర్సన్ సుబ్బారెడ్డి, సరస్వతమ్మ పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన విజయో త్సవ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి ముగ్గురి విద్యార్థుల్లో ఒకరు 80 శాతం పైగా మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. 21 మంది విద్యార్థులు 450 పైగా మార్కులు సాధించిరన్నారు.. పదవ తరగతి ఫలితాలలో విద్యార్థులు పి. చరణ్ సిద్ధార్థ 484/500, పి.చైత్ర వసంత్ 480/500,కె.నాగ నిహారిక 474/500, డి.పూర్విత 472/500,ఎం.జాహ్నవి 471/500, ఎస్.అబ్బాస్ హుస్సేన్ 471/500, బి. విజ్ఞత 471, కే.శంకర్ 467/500, జి. పూజిత రెడ్డి 464/500, వై. యోజ నారెడ్డి 462/500, ఎల్. తరుణాదిత్య 461/500, ఎస్. అంజనారెడ్డి 460/500,కే.దీక్షిత రెడ్డి 460/500, జి. హేమ శృతి 458/500,పి. రామ్ దినేష్ రెడ్డి 457/500,బి.స్వప్న 455/500, మంజునాథరెడ్డి 455/500, పి.శ్రీ మహాలక్ష్మి 454/500, పి.వీరభవ్యస్వి 453/500, ఎల్.జ్ఞాపికా రెడ్డి 452/ 500,పి. నిత్యానంద రెడ్డి 451/500 మార్కులు సాధించి జిల్లాకే గర్వకారణంగా నిలిచారని పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియట్ ఫలితాలలో విద్యార్థులు బోయ రామకిషోర్ అనే విద్యార్థి 469/500మార్కులు, వడ్ల శ్రీరామ్, లింగసాని దుష్యంత్ 467/500 మార్కులు సాధించి కడప జిల్లా టాపర్లుగా నిలిచారని మరో 22 మంది విద్యార్థులు 420 పైగా మార్కులను సాధించారని తెలిపారు. ఫలితాలతో బీరం విద్యాసంస్థ జిల్లాలోనే అత్యుత్తమ విద్యాసంస్థగా నిలిచిందని చెప్పడానికి గర్వంగా ఉందని వారు వెల్లడించారు. విద్యార్థులను నైపుణ్యానికి ఉపాధ్యాయుల మార్గదర్శకానికి ఇది గొప్ప గుర్తింపుగా నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం విజేతగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. బీరం విద్యాసంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, స్కూల్ ప్రిన్సిపల్ శ్వేతా, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలని అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.



484/500 మార్కులు సాధించిన చరణ్ సిద్దార్థ

పాలిసెట్‌లో జెవివి విద్యార్థుల సత్తా



విజయ చిహ్నాన్ని చూపుతున్న విజేతలు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ఎపిఆర్‌జెసి, పాలిసెట్‌లో జెవివి ఉచిత కోచింగ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ జిల్లా గౌరవ సలహాదారులు గోపీనాథ్ రెడ్డి విజేతలకు గురువారం అభినందనలు తెలిపారు. స్థానిక జెవివి కార్యాలయంలో విజేతలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో జరిగిన ఎపిఆర్‌జెసి పరీక్షలో పి సంజనరెడ్డి 365, ఎస్ హుస్సేన్‌వల్లి 7867 ర్యాంకులు సాధించారని తెలిపారు. అదేవిధంగా పాలిసెట్‌లో ఎం. లోకనాథ్ 2080, జి హరి కేశవరావు 2826, ఎస్. ఎస్ జుబేదా 5546, జి యశ్వంత్ 673, పి హాసిని 7573, పి.వి సాయిచరణ్ 7879 ర్యాంకులు సాధించారని చెప్పారు. రాసిన ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచితంగా పాలీసెట్ కోచింగ్‌ను మూడేళ్లుగా నిర్వహిస్తున్నామని, ఉచిత కోచింగ్‌తోపాటు గౌతమి ఇంజినీరింగ్ కాలేజీ సహకారంతో విద్యార్థులకు మెటీరియల్స్‌ను కూడా అందించామని పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిని ఈ సందర్భంగా అభినందించారు. ఉచిత కోచింగ్‌కు అనేకమంది ఉపాధ్యాయులు వారి మేధో సంపత్తిని అందించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు వేంపల్లి రాజశేఖర్, దేవానంద్, రాకేష్, గురు, మహమూద్, జిటి ఈశ్వరయ్య, తిరుమల కొండ, అల్లా బకాష్, విద్యార్థులు హేమలత, హాసిని, సోయబ్, నరసింహ, కువన్, అవేష్, గురు, చందన, శిరీష, సుజిత, ఆసరా, సారథి, అనుశ్రీ పాల్గొన్నారు.

శ్రీనివాస పాఠశాల విద్యార్థి విజయం

ప్రజాశక్తి - వేంపల్లె

పాలిసెట్‌లో శ్రీనివాస పాఠశాలకు చెందిన విద్యార్థి అరవింద్ రెడ్డి ప్రతిభ చాటినట్లు అ పాఠశాల కరస్పాండెంట్ కేశవులు తెలిపారు. గురువారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో అరవింద్ రెడ్డికి 125 మార్కులకు గాను 109 మార్కులు వచ్చినట్లు కరస్పాండెంట్ కేశవులు తెలిపారు. దీంతో అరవింద్ రెడ్డికి రాష్ట్ర స్థాయిలో 1800 ర్యాంకు వచ్చినట్లు చెప్పారు. ఎలాంటి కోచింగ్ లేకుండా పాలిసెట్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ చాటినట్లు చెప్పారు. పదోతరగతి పరీక్షల్లో కూడ 600కు 591 మార్కులు సాధించినట్లు చెప్పారు. పాఠశాల శ్రమకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. గురువారం పాలిసెట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థి అరవింద్ రెడ్డికి కరస్పాండెంట్ కేశవులు అభినందించారు.

బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆరోగ్యం పట్ల కిశోర బాలికలు జాగ్రత్తలు వహించాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం అన్నారు. గురువారం తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వేంపల్లె -1 దళితవాడలోని అంగన్వాడీ కేంద్రంలో టీనేజ్ ప్రెగ్నెన్సీపై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. యుక్తవయసులో గర్భిణి కావడం మంచిది కాదన్నారు. 13 ఏళ్ల నుంచి 19 ఏళ్ల మధ్య ఉండే వయస్సు గల బాలికలను టీనేజర్స్ అంటారని చెప్పారు. ఈ వయస్సులో ఉన్న బాలికలకు శరీరంలో మార్పులు అనేవి ఉండవని చెప్పారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ కావడం పట్ల పిల్లల చదువు ఆగిపోవడంతో పాటు ఆర్థికంగా ఇతరులపై ఆధార పడతారని చెప్పారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలో నెలలు నిండకుండానే కాన్పు అవుతుందని, అప్పుడు రక్తహీనత, పోషకాహార లోపం, కాన్పు సమయంలో రక్త స్రావం, కాన్పు తర్వాత రక్త స్రావం జరగడం లాంటివి ఉంటాయని చెప్పారు. మాతృ, శిశు మరణాలు జరగవచ్చు అన్నారు. గర్భిణి కావడానికి సరి అయిన వయస్సు 20 నుండి 30 సంవత్సరాలు అన్నారు. గర్భం దాల్చే వయస్సు కంటే తక్కువగా ఉన్నప్పుడు పూర్తిగా శరీరం ఎదుగుదల లేకుండా ముందే ప్రెగ్నెన్సీ అయితే దానిని టీనేజ్ ప్రెగ్నెన్సీ అంటారని చెప్పారు. బాల వివాహలు చేపట్టడం చట్ట రీత్యా నేరమని చెప్పారు. బాల్య వివాహాలు చేసిన తల్లితండ్రులు, పురోహితులకు, ప్రోత్సహించిన బంధువులకు చట్టం ప్రకారం శిక్ష అర్హులు అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జి. లక్ష్మి దేవి, ఎ. లక్ష్మీ దేవి, మహిళా పోలీసు అర్చన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై కళాజాతా

ప్రజాశక్తి-చెన్నూరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కళాజాతా ద్వారా హెచ్ఐవి, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. గురువారం కళాజాతా బృందం సభ్యులు జయశంకర్ చెన్నూరు సెంటర్ వద్ద ఆధునిక కళాజాత వీధినాటకం వేశారు. హెచ్ఐవి నాలుగు మార్గాల ద్వారానే వస్తుందని, సురక్షితం కాని లైంగిక సంబంధాలు కలుషిత రక్తాలు , హెచ్ఐవి సోకిన తల్లి నుండి బిడ్డకు సురక్షితం కానటువంటి బ్లేడ్లు, సిరంజీలు ద్వారా ప్రబలే ప్రమాదముందని వివరించారు. అన్ని ప్రభుత్వాసుపత్రులలో ఉచిత పరీక్షలు చేస్తారని తెలిపారు. ఉచితంగా మందులు కూడా అందిస్తారని పేర్కొన్నారు. కళాజాతా బృందం పాటలు, నాటికలు, ఇంద్రజాల మహేంద్రజాలం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత బృందం వై.సుధాకర్, ఎం.రాఘవేంద్రబాబు, కె.జయరామయ్య, ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా దశలో సృజనాత్మకత మెరుగవ్వాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : విద్యా దశలో సృజనాత్మకత మెరుగు అవ్వాలని, తద్వారా సమాజంలో ఉన్నత స్థాయిలో రాణించగలుగుతారని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న పేర్కొన్నారు. గురువారం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విజ్ఞానం- వినోదం- వికాసం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బయన్న మాట్లాడుతూ పిల్లలు ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలని తెలిపారు. మాయలు మంత్రాలు లేవని వాటిని నమ్మవద్దని చెప్పారు. సైన్స్ ద్వారా మ్యాజిక్కులు నిర్వహించి వాటి వెనుక ఉన్న సూత్రాలను పిల్లలకు వివరించారు. గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఉమాదేవి మాట్లాడుతూ వేసవి సెలవులలో ప్రతిరోజు మనోవికాస కార్యక్రమాలు జరుగుతున్నాయని, అందులో విద్యార్థులు పాఠకులు అందరూ పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడాలి

ప్రజాశక్తి -బద్వేలు

మత సామరస్యాన్ని కాపాడాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి. చాంద్‌బాషా, మాస్ కమిటీ అధ్యక్షులు ఎస్. అల్లాబకాకష్, ఉపాధ్యక్షులు మహబూబ్‌బాష, జిలానిబాషా, కౌన్సిలర్ మహమ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని జయ సుబ్బారెడ్డి కళాశాల సమీపంలో ఉన్న మాబు సుభాని దర్గా(జండా చెట్టు)ను బుధవారం అధికారులు కూల్చివేయడం దారుణమన్నారు. గురువారం వారు దర్గా ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో ఇలాంటి ఘటనలకు పాల్పడ్డం బాధాకరం అన్నారు. 50 ఏళ్లుగా దర్గా జెండా చెట్టు ఉందన్నారు. దర్గాకు హిందూ ముస్లిం సోదరులు వచ్చి ప్రార్థనలు చేసుకుంటారని చెప్పారు. అలాంటిది మున్సిపల్ అధికారులు దర్గా ప్రహరీని కూల్చి ప్రజల మనోభావాలు దెబ్బతీశారని వాపోయారు. ఈ విషయం పైన బద్వేల్ మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించంగా ఆయన పొంతన లేని సమాధానం చెప్పారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కూల్చిన ప్రహరీని నిర్మించి మతసామరస్యాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ కార్యదర్శి అన్వర్‌బాష, ముస్లిం నాయకులు షరీఫ్, బాబ్జి, మాహీర్, రెడ్డిబాషా, మౌలాలి, ఇబ్రహీం, సర్దార్, ముస్లిం సోదరులు ,మహిళలు పాల్గొన్నారు.

విలేజ్ లెవెల్ కెఎంపి ప్రచారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గ్రామస్థాయి కెఎంపి ప్రచారాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రకృతి వ్యవసాయ రైతులను గుర్తించాలని ఎపి సిఎన్ఎఫ్ డిపిఎం ఎస్.వి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న విలేజ్ లెవల్ ప్రచారాన్ని నిర్వహిచి ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా, వెలుగు శాఖ వారితో కలిసి కెఎంపి రైతుల వివరాలను సర్వే చేసి వారికి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ వేసవికాలంలో రైతులతో పిఎండిఎస్ వేయాలని సూచించారు. రుతుపవనాలు రాకముందే మెట్ట భూములలో విత్తనాలు రైతులు విత్తుకొనేలా మోటివేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం వసంత కుమారి, యంగ్ ప్రొఫెషనల్ భరత్, ఎన్ఎఫ్ఏ చంద్రమౌళేశ్వర్ రెడ్డి, శ్యామ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న డిపిఎం ప్రవీణ్ కుమార్



తాగునీటి ఫిల్టర్ ను ప్రారంభిస్తున్న టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి లక్ష్యంగా తీసుకొన్నట్లు టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక పాపాఘ్ని నదిలో నూతనంగా వేసిన తాగునీటి ఫిల్టర్‌లను మండల కన్వీనర్ రామమునిరెడ్డితో కలిసి ప్రారభించారు. ఈ సందర్భంగా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు కలెక్టర్ దృష్టికి మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల ఇన్ ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి తీసుకెళ్లి పాపాఘ్ని నదిలో తాగునీటి ఫిల్టర్స్ వేసేందుకు రూ 1.50 కోట్ల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. అ నిధులతో 6 తాగునీటి ఫిల్టర్స్ వేశారన్నారు. అలాగే మరో 2 రెండు బోర్లు కూడా వేస్తారని తెలిపారు. నూతనంగా వేసిన ఫిల్టర్స్ ద్వారా వేంపల్లె గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి పాపాఘ్ని నీటిని సరఫరా చేస్తారని చెప్పారు. పాపాఘ్ని నదిలో కొత్త ఫిల్టర్స్ వేయడం ద్వారా నీటి కష్టాలు తీరాయని పేర్కొన్నారు. పిబిసి నుండి కృష్ణా జలాల కూడా త్వరలో పాపాఘ్ని నదికి వస్తాయన్నారు. ఇప్పటికే నందిపల్లె చెరువుకు కృష్ణాజలాలు రావడం పట్ల పాపాఘ్ని నదిలో కూడ భూగర్భ జలాలు కొద్ది మేరకు పెరిగినట్లు చెప్పారు. పాపాఘ్ని నదికి కృష్ణా జలాలు వస్తే భూగర్భ జలాలు పెరిగి అడుగంటి పోయిన నీటి బోర్లలో నీటి మట్టం పెరుగుతుందని అన్నారు. గ్రామ పంచాయతీకి కార్యదర్శిని కూడా నియమించామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎక్కడ అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బస్టాండ్, జంతు వధశాలకు వేలం

ప్రజాశక్తి - ముద్దనూరు

2025 -26 ఆర్థిక సంవత్సరానికి గానూ బస్టాండ్, జంతు వధశాలకు సంబంధించి రుసుం వసూళ్లు చేసుకునేందుకు శనివారం మధ్యాహ్నం పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గురువారం కార్యదర్శి లక్ష్మీ నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్‌లో వాహనాలకు రుసుం వసూళ్లు చేసుకునేందుకు రూ. 4 లక్షలు డిపాజిట్ చెల్లించాలన్నారు. జంతు వధశాలకు 4రూ. 0 వేలు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చున్నారు. రుసుం వసూళ్లు చేసుకునేందుకు 2026 మార్చి వరకు హక్కు ఉంటుందని కార్యదర్శి తెలిపారు.



అంగన్వాడీ విద్యార్థులతో సిబ్బంది

చిన్నారులను 'అంగన్వాడీ'లో చేర్పించాలి

ప్రజాశక్తి - చాపాడు

చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. మండలంలోని పల్లవోలు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత ఉత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్రానికి వచ్చే చిన్నారులను తమ అంగన్వాడీ కార్యకర్తలు కంటికి రెప్పలా చూసుకోవడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారని తెలిపారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపాలని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల్లో ఎల్‌కెజి, యుకెజి తరగతులు కంటే మెరుగ్గా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను చూసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఐటిసి జిల్లా కో-ఆర్డినేటర్ స్వరూపారాణి, పల్లవోలు సర్పంచ్ ప్రసాద్, అంగన్వాడీ టీచర్ రామలక్ష్మి, సుజాత, తాహీరా, క్రిష్ణవేణి, కవిత, పార్వతి, యల్లమ్మ, రోజమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు : మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా సాఫ్ట్‌వేర్ కోర్సులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి తెలిపారు. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్, వెబ్ డెవలపర్ అనే రెండు కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ కూడా అందజేస్తామని తెలిపారు. సర్టిఫికెట్ అనంతరం ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని తెలిపారు. మైదుకూరు, ఇతర పరిసర ప్రాంతాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ఇంటర్ లేదా ఆపైన విద్యార్హత కలిగి బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులన్నారు. ఇతర వివరాల కోసం 9398348760లో సంప్రదించాలని తెలిపారు.

ఈసారైనా ఎన్నికలు సజావుగా నిర్వహించండి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

గతంలో వాయిదా పడిన గోపవరం ఉపసర్పంచ్ ఎన్నిక ఈనెల 19న సజావుగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కలెక్టర్, ఎస్పి అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రెండు నెలల కాలంలో బలాబలాలు ఏమాత్రం మారలేదని అన్నారు. తమకు 13 మంది సభ్యుల మద్దతుంటే టిడిపికి ఏడుగురు సభ్యులున్నారని తెలిపారు. మార్చి 27న చేసిన తప్పు ఈనెల 19న ఉపసర్పంచ్ ఎన్నికల్లో దయచేసి చేయవద్దని రాచమల్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఎన్నికలు సజావుగా జరగని పక్షంలో తమకు ఎలాంటి నష్టం వాటిల్లదని చెడ్డ పేరు అంతా పోలీసు, రెవెన్యూ, ఎన్నికల అధికారికి వస్తుందని చెప్పారు. ఈసారైనా ఎన్నికల అధికారి ఆరోగ్య పరీక్షలు చూసుకొని విధులు నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు.

కార్డుదారులకు రేషన్ బియ్యం అందజేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

తెల్ల రేషన్ కార్డులు ఉన్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రేషన్ బియ్యాన్ని డీలర్లు సరఫరా చేయాలని తహశీల్దార్ హరినాథ్ రెడ్డి ఆదేశించారు. గురువారం వేంపల్లెలోని రేషన్ షాపులను తనిఖీలు చేపట్టారు. అలాగే బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే నిత్యావసర సరుకులను ప్రతి కార్డు దారునికి సకాలంలో అందజేసి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. బియ్యం పంపిణీలో అక్రమణలకు పాల్పడితే అలాంటి డీలర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తూకల్లో మోసం చేయకుండా ప్రజలకు బియ్యం పంపిణీ చేయాలని సూచిచారు. ప్రజల నుండి పిర్యాదులు రాకుండా చూసు కోవాల్సిన బాధ్యత రేషన్ డీలర్లుపై ఉందన్నారు. బియ్యం పంపిణీ కావడం లేదని కార్డుదారుల నుంచి పిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. బియ్యం నిల్వ ఉన్న డీలర్లు అందరూ బియ్యం పూర్తిగా అయి పోయే వరకు పంపిణీ చేయాలని చెప్పా రు. ఆయన వెంట ఆర్ఐ లోకేష్, డీలర్ ఈశ్వరయ్య, విఆర్ఒలు పాల్గొన్నారు.

చిన్నపిల్లలకు ఆధార్ తప్పనిసరి

ప్రజాశక్తి - వేముల

చిన్నపిల్లలకు ఆధార్ నమోదు తప్పని సరి అని ఎపిడిఒ రాధాకృష్ణవేణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక సచివాలయంలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు ఆధార్ క్యాంపు నిర్వహిచనున్నామని తెలిపారు. .ఆధార్ క్యాంపులో ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు ఉచితంగా ఆధార్ కార్డు నమోదు చేసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగించుకోవాలని ఎంపిడిఒ పేర్కొన్నారు.